


అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం
శ్రీ సత్యసాయి
5
గురువారం 18 డిసెంబర్ 2025

# రాయదుర్గం నియోజకవర్గంలో విచ్చలవిడిగా కల్తీ కల్లు



రాయదుర్గం, డిసెంబర్ 17 (అనంత ప్రభ)

రాయదుర్గం నియోజకవర్గంలో క్లోరల్ హైడ్రేట్ అనే ప్రాణాంతకమైన రసాయనంతో తయారుచేసిన కల్తీ కల్లును విచ్చలవిడిగా అమ్ముతున్నారు ఈ విషయాన్ని మేము చెప్పడం కాదు ఈ కల్తీ కల్లు వల్ల ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకుని ఎంతోమంది మహిళలు చిన్న వయసులోనే వితంతువులుగా మారి జీవితాలు నాశనం అవుతున్న ఆంధ్రప్రదేశ్ సరిహద్దుకు దగ్గరలో ఉన్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన సరిహద్దు గ్రామాల్లో ప్రజలు మాట్లాడుతున్న వాస్తవం.

రాయదుర్గం నియోజకవర్గం లో యథేక్షగా విచ్చలవిడిగా కల్తీ కల్లు అమ్ముతున్నారు దానికి తోడు పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన పలు గ్రామాలకు కూడా ఇది సరఫరా అవుతుంది. కేవలం ఈ సంవత్సర కాలంలోనే దరిదాపు కర్ణాటక ఎక్సైజ్ అధికారులు 75 క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగింది. ఆంధ్ర మరియు కర్ణాటక రెండు రాష్ట్రాలకు సంబంధించిన ఎక్సైజ్ అధికారుల సమన్వయ సమావేశంలో కర్ణాటక ఎక్సైజ్ అధికారులు ఈ విషయాన్ని ఆంధ్ర ఎక్సైజ్ అధికారులకు తెలియజేసి మీరు ఆంధ్రప్రదేశ్ నుంచి కర్ణాటకకు అక్రమంగా సరఫరా అవుతున్న కల్తీకల్లును నియంత్రించవలసిందిగా కోరుకున్నారు కానీ రాయదుర్గం నియోజకవర్గం ఎక్సైజ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు దానికి తోడు మరింత విచ్చలవిడిగా కల్తీ కల్లు అమ్మకాలను మరింత ఎక్కువగా సాగిస్తున్నారు.

దీనికి సంబంధించి సండూరు శాసన సభ్యులైన శ్రీమతి అన్నపూర్ణమ్మ గారు కర్ణాటక అసెంబ్లీలో విషయాన్ని లేవనెత్తి కల్తీ కల్లు తాగి వందలాదిమంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని అందువల్ల ఎంతో మంది మహిళలు చిన్న వయసులోనే వితంతువులుగా మారి వారి పిల్లలు అనాథలుగా అయ్యి కుటుంబాలు విచ్ఛిన్నమై సర్వనాశనం అవుతున్నారని కాబట్టి ఈ కల్తీకల్లు మహమ్మారిని నియంత్రించవలసిందని కర్ణాటక ప్రభుత్వాన్ని వేడుకోవడం జరిగింది. ఆ తర్వాత సండూరు శాసనసభ్యులు శ్రీమతి అన్నపూర్ణమ్మ గారు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి అలాగే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారికి విడివిడిగా ఉత్తరాలు రాస్తూ ఈ కల్తీకల్లు వల్ల ప్రాణాలు పోగొట్టుకుని మహిళలు వితంతువులై కుటుంబాలు నాశనం అవుతున్న విషయాన్ని వివరంగా తెలుపుతూ రాయదుర్గంలో నడుస్తున్న కల్తీకల్లు వ్యవహారాన్ని నియంత్రించవలసిందిగా వేడుకోవడం కూడా జరిగింది. రాయదుర్గం నియోజకవర్గం సరిహద్దు గ్రామాల ద్వారా సరఫరా అవుతున్న కల్తీ కల్లును తాను కొని దానిని లేబరేటరీకి పంపించగా అందులో ప్రాణాంతకమైన క్లోరల్ హైడ్రేట్ రసాయాలు ఉన్నాయని ఇది మానవులు ఉపయోగించడానికి పనికిరానిదని ల్యాబ్ రిపోర్ట్ కూడా ఇచ్చారని ఆ ల్యాబ్ రిపోర్ట్ ను కూడా గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి అదేవిధంగా పవన్ కళ్యాణ్ గారికి రాసిన ఉత్తరానికి జతపరిచినట్టు కూడా తెలియజేశారు.

కానీ ఆమె ఆవేదన అరణ్య రోదన గా మిగిలిపోయింది యధావిధిగా అక్రమ కల్తీ కల్లు వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా రోజురోజుకూ పెరిగిపోతోంది.

ఈ అక్రమ కల్తీకల్లు వ్యాపారంలో ఎక్సైజ్ అధికారులు,ముఖ్య తెదేపా నాయకులతోపాటు ఒక ప్రముఖ తెలుగు దినపత్రిక కు చెందిన పత్రికా విలేకరి వాటాదారులుగా ఉన్నట్టు ప్రజలు మాట్లాడుకుంటున్నారు. మొత్తం వ్యాపారం పత్రికా విలేకరి కనుసన్నల్లోనే నడుస్తున్నందువల్ల దీన్ని ఆపడానికి ఎవరికి ధైర్యం లేకుండా పోయింది.

ఇంతకుముందు రాయదుర్గంలో స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారులు కల్లు డిపోపై దాడి చేసి కల్లులో ప్రాణాంతకమైన క్లోరల్ హైడ్రేట్ రసాయనము ఉన్నందున డిపోను సీజ్ చేసి కొంతమంది పై కేసులు కూడా నమోదు చేశారు అయినా కల్తీకల్లు వ్యాపారం ఆగలేదు.


ఇంకా ఎంతమంది చావాలో, ఇంకా ఎంతమంది మహిళలు వితంతువులవ్వాలో ఇంకా ఎంతమంది చిన్నారులు అనాథలుగా అభాగ్యులుగా మారి వారి బ్రతుకులు మాడి మసై పోవాలో ఇంకా ఎంతకాలం శవాలపై చిల్లర ఏరుకొని డబ్బులు కూడగట్టుకుంటారో వారి ధన దాహానికి ఎన్ని శవలైతె సరిపడతాయో అర్థం కాక ప్రజలు అల్లాడిపోతున్నారు. మానవత్వం మంట కలిసిపోతున్న ఈ అక్రమ కల్తీకల్లు వ్యాపారం ఎప్పటికి ఆగుతుందో అర్థం కాని పరిస్థితులు రాయదుర్గం నియోజకవర్గం లో కనపడుతున్నాయి.

నేను చెబుతున్న ఈ విషయాలకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలను, కల్తీ కల్లులో ప్రాణాంతకమైన క్లోరల్ హైడ్రేటు రసాయనాలు ఉన్నట్టు అది మానవులు సేవించడానికి ఉపయుక్తం కాదని తెలుపుతున్న లేబరేటరీ రిపోర్టులను, సండూరు శాసనసభ్యురాలు శ్రీమతి అన్నపూర్ణమ్మ గారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారికి మరియు ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారికి రాసిన ఉత్తరాల ప్రతులను కూడా అన్నింటిని కూడా మీ ముందు ఉంచాను.

మీడియా సోదరులారా మీకు కూడా కుటుంబాలు ఉన్నాయి మీకూ పిల్లలు ఉంటారు ఒక్కసారి ఆలోచించండి ఇంట్లో ఒక మనిషిని పోగొట్టుకున్న బాధ ఎలా ఉంటుంది ఇంట్లో ఒక అక్కనో చెల్లెలో లేదా కూతురో వితంతువుగా మారితే ఆ పరిస్థితులు ఎలా ఉంటాయి మన పిల్లలు అనాథలై బజారుపాలైపోతే పరిస్థితి ఎలా ఉంటుంది ఆలోచించండి ఎంతోమంది నిండు ప్రాణాలను బలిగొంటున్న ఈ ప్రాణాంతకమైన కల్తీకల్లు వ్యాపారాన్ని అడ్డుకోవడంలో మీ వంతు సహాయ సహకారాలు అందించాలని మీకు చేతులెత్తి నమస్కరించి వేడుకుంటున్నాను.

చిందనూరు నాగరాజు రాష్ట్ర కార్యదర్శి మరియు రాయలసీమ ఇంచార్జ్ బహుజన సమాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంకె కొల్లాయప్ప జిల్లా అడ్వైజర్ కమిటీ హరిప్రసాద్ అనంతపురం నియోజకవర్గ అధ్యక్షులు నాగేంద్ర సింగనమల్ల నియోజకవర్గం అధ్యక్షులు శివశంకర్ ఉపాధ్యక్షులు రాజు అశోక్ మరియు మహిళా నాయకురాలు బహుజన సమాజ్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## 5వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్



పుట్టపర్తి, డిసెంబర్ 17 (అనంత ప్రభ)

శ్రీ సత్యసాయి జిల్లా అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించే విధంగా.. 2047 విజన్ ప్రణాళికలను పటిష్టంగా అమలు చేసే విధంగా కృషి చేస్తున్నట్లు శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారికి వివరించారు.

బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న 5వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా సమీక్షలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశాలు, ఆశయాల మేరకు సుపరిపాలన, సుస్థిరాభివృద్ధి, జీఎస్డీపీ లక్ష్యాలు, కీ పార్ఫెమెన్స్ ఇండికేటర్లు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలలో లక్ష్యం మేరకు వందశాతం ప్రగతి సాధనకు కృషి చేయడం జరుగుతుందని వివరించారు. పర్యాటకాభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యుల ఆదేశాల మేరకు గత నవంబర్ మాసంలో 16 నుంచి 23 వరకు రాష్ట్ర పండుగగా ప్రకటించిన భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాలను.. రాష్ట్ర ముఖ్యమంత్రి , మంత్రుల బృందం మరియు ఉన్నతాధికారుల స్వీయ పర్యవేక్షణలో.. ముఖ్యమంత్రి గారిని స్ఫూర్తిగా తీసుకొని ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకుని అత్యంత ఘనంగా వేడుకగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ శత జయంతి ఉత్సవాలలో దాదాపు 8.50 లక్షల మంది పాల్గొన్నారని, శ్రీ సత్య సాయి జిల్లా కీర్తిని ప్రపంచానికి చాటడంలో ముఖ్యమంత్రి గారు అందించిన సహకారానికి ధన్యవాదాలు తెలియ జేస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం జన సమర్థం పోర్టల్ ప్రారంభించిందని, అందులో ఒకసారి రైతు ఈకేవైసీ పూర్తి చేసుకుంటే... వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధకం, సూర్యఘర్ తదితర ప్రభుత్వ పథకాలపై ఏ రుణం మంజూరు చేయాలన్న ఒకటే ఫ్లాట్ ఫారం నుంచి మంజూరు చేయడానికి వీలవుతుందని.. దరఖాస్తును ట్రాక్ చేయడానికి కూడా అవకాశం ఉంటుందని.. డిజిటల్ అప్రూవ్ ఉంటుందని వివరించారు. దీనిని మన రాష్ట్రంలోని జిల్లాలలో కూడా అమలు పరిచే విధంగా పరిశీలన చేయాలని ముఖ్యమంత్రి గారికి కలెక్టర్ విన్నవించారు. అలాగే ప్రభుత్వ అమలు చేస్తున్న వివిధ పథకాలలో ప్రజాసానుకుల అవగాహన పెంచేందుకు కూడా జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా సమగ్ర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, అమలు చేయాల్సిన ప్రణాళికలు, కార్యాచరణ కార్యక్రమాలపై కూడా కలెక్టర్ ముఖ్యమంత్రికి సమగ్రంగా వివరించారు.

ఈ సదస్సులో ఉపముఖ్యమంత్రి వర్యుల, రాష్ట్ర మంత్రులు, చీఫ్ సెక్రటరీ, ఆయా శాఖల ప్రధాన కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ పవిత్రతను కాపాడాల్సింది పూజారే
## రాజకీయ కుట్రల పేరుతో తప్పులను కప్పిపుచ్చుకోవడం సరికాదు



శింగనమల, డిసెంబర్ 17 (అనంత ప్రభ)

శింగనమల శ్రీ దుర్గా ఆంజనేయస్వామి ఆలయానికి సంబంధించిన అంశంలో "రాజకీయ కుట్రలు" అంటూ ఆరోపించడం పూర్తిగా దారి తప్పిన వాదనగా భక్తులు, గ్రామస్థులు స్పష్టం చేస్తున్నారు.

గత కొంతకాలంగా ఆలయంలో పూజారి రమణాచారి వ్యవహారం భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తోందన్నది సింగనమల ప్రజల ఆవేదన.

గుప్త నిధుల పేరుతో అనవసర ప్రచారాలు, భక్తులకు దర్శనాల్లో వివక్ష, ఆలయ వ్యవహారాల్లో స్వేచ్ఛాచారం, ప్రజాప్రతినిధులపై ఆరోపణలు చేస్తూ ఆలయాన్ని రాజకీయ రంగస్థలంగా మార్చడం ఇవన్నీ పూజారి చేసిన తప్పిదాలుగా బహిరంగంగానే ఆరోపణలు వస్తున్నాయి.

ఈ వ్యవహారాన్ని పక్కదారి పట్టించి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆమె తల్లి బండారు లీలావతి రాజకీయ దాడి చేయడం పూర్తిగా వైసీపీ ప్రేరిత కుట్రగా ప్రజలు భావిస్తున్నారు.

ఎమ్మెల్యే గానీ, ఆమె తల్లి గానీ ఎప్పుడూ దేవాలయ సంప్రదాయాలు, పవిత్రతకు కట్టుబడి ఉన్న నాయకులేనన్నది సింగనమల ప్రజలకు తెలిసిన సత్యం. ఆలయంపై దాడులు చేయాలని గానీ, పూజారిపై రాజకీయ ఒత్తిడి తేవాలని గానీ ఎక్కడా వారు ప్రయత్నించలేదన్నది స్పష్టమైన నిజం.

భక్తుల ప్రయోజనాల దృష్ట్యా దేవాలయ పరిపాలనలో పారదర్శకత, శుభ్రత, సమానత్వం ఉండాలి అన్నదే ఎమ్మెల్యే గారి స్పష్టమైన అభిప్రాయం.తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు "రాజకీయ ఒత్తిడి", "దాడి ప్రయత్నాలు" అంటూ నిరాధార ఆరోపణలు చేయడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమే తప్ప మరొకటి కాదని గ్రామస్థులు మండిపడుతున్నారు.

ఇక వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి శైలజనాథ్ వ్యాఖ్యలకు అసలు నైతికతే లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.2012%–%13లో ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే దుర్గాంజనేయ స్వామి ఆలయ గోపురాన్ని కొల్లగొట్టి గుప్త నిధులు తీసుకెళ్లారన్న ఆరోపణలు ఇప్పటికీ ప్రజల నోట నానుతున్నాయి.గుప్త నిధుల వ్యవహారం ఆయనకు బాగా తెలుసు కాబట్టే ఈరోజు ఇతరులపై నిందలు మోపుతున్నారని తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బండారు శ్రావణిశ్రీ , ఆమె తల్లి బండారు లీలావతి గత 20 ఏళ్లుగా దేవాలయాల అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కోసం నిరంతరం కృషి చేసిన నాయకులు.

అలాంటి వారిపై బురదజల్లే ప్రయత్నాన్ని సింగనమల ప్రజలు పూర్తిగా తిరస్కరిస్తున్నారు.

ఇక్కడ ప్రజలు వైసీపీకి కొన్ని సూటి ప్రశ్నలు వేస్తున్నారు:

వైసీపీ ప్రభుత్వ హయాంలో పూజారుల మీద దాడులు జరగలేదా?

అనేక దేవాలయాల గోపురాలు కూల్చివేయబడిన చరిత్ర మీ ప్రభుత్వానికి లేదా?

హిందూ దేవాలయాలపై నిర్లక్ష్యం, దాడులు జరిగినప్పుడు మీ నాయకులు ఎందుకు మౌనం వహించారు?

గుడులు కూల్చిన వైసీపీకి ఈరోజు దేవాలయ పవిత్రతపై మాట్లాడే అర్హత ఉందా?

మరోవైపు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత:

అనేక దేవాలయాల్లో కొత్త గోపురాల నిర్మాణం
ఆలయాల అభివృద్ధికి నిధుల కేటాయింపు
భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి
సంప్రదాయాల పరిరక్షణకు చర్యలు

ఇవన్నీ ప్రజల కళ్ల ముందున్న వాస్తవాలు కాదా అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

దేవాలయాలు రాజకీయాలకు అతీతంగా ఉండాలి.
పూజారుల పేరుతో జరిగే తప్పులను ప్రశ్నించడం నేరం కాదు
తప్పు చేసినవారిపై చర్యలు తీసుకోవడం తప్పనిసరి.

భక్తుల విశ్వాసం, ఆలయ గౌరవం కాపాడడమే లక్ష్యంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ముందుకు సాగుతుండగా, దీనిని వక్రీకరించి వైసీపీ రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం మంచి పద్ధతి కాదని సింగనమల ప్రజలు స్పష్టంగా హెచ్చరిస్తున్నారు.




## హెల్మెట్ ధారణపై తాడిపత్రిలో బైకు అవగాహన ర్యాలీ



అనంతపురం, డిసెంబర్ 17 (అనంత ప్రభ)

జిల్లా ఎస్పీ శ్రీ పి. జగదీష్ ఆదేశాల మేరకు ఈరోజు తాడిపత్రి పట్టణంతో పాటు సబ్ డివిజన్ పరిధిలోని మండల కేంద్రాలలో రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో హెల్మెట్ ధారణపై బైకు అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

ఈ కార్యక్రమాలు ఏఎస్పీ శ్రీ రోహిత్ కుమార్ చౌదరి ఆధ్వర్యంలో చేపట్టారు. ర్యాలీల సందర్భంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలనే అంశంపై అవగాహన కల్పించడంతో పాటు, రోడ్డు ప్రమాదాల నివారణలో హెల్మెట్ ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు.

ఈ సందర్భంగా ఏఎస్పీ గారు మాట్లాడుతూ... ద్విచక్ర వాహన ప్రమాదాల్లో తల గాయాల వల్ల ప్రాణనష్టం అధికంగా జరుగుతోందన్నారు. తాడిపత్రి సబ్ డివిజన్లో ఇటీవల జరిగిన ఫ్యాటల్ రోడ్ యాక్సిడెంట్స్ ఘటనల్లో ముగ్గురు తలకు హెల్మెట్ ధరించక పోవడం వల్లనే చనిపోయారన్నారు. అందుకే... హెల్మెట్ ధరించడం ద్వారా అనేక విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. రోడ్డు నిబంధనలను కచ్చితంగా పాటించడం ప్రతి పౌరుని బాధ్యత అని, భద్రతే ప్రధాన లక్ష్యంగా వాహనాలు నడపాలని సూచించారు.

తాడిపత్రి పట్టణంలో నిర్వహించిన బైకు అవగాహన ర్యాలీ తాడిపత్రి రూరల్ యూపీఎస్ నుంచి ప్రారంభమై అశోక్ పిల్లర్ వరకు కొనసాగి, తిరిగి తాడిపత్రి రూరల్ యూపీఎస్ వద్ద ముగిసింది.

ఈ అవగాహన ర్యాలీలలో ఏఎస్పీ శ్రీ రోహిత్ కుమార్ చౌదరి తో పాటు సీఐ లు శివ గంగాధర్ రెడ్డి, ఆరోహన్ రావు, ఎస్ఐలు ధరణి, ఎంవీఐ రాజగోపాల్, ద్విచక్ర వాహన షోరూములైన రాయల్ ఎన్‌ఫీల్డ్, టీవీఎస్, హోండా, హీరో, సుజుకి షోరూముల మేనేజర్లు మరియు వారి సిబ్బంది, అర్జాస్ స్టీల్ ఫ్యాక్టరీ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు మరియు మీడియా ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ధర్మవరంలో ఘనంగా విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం




ధర్మవరం, డిసెంబర్ 17 (అనంత ప్రభ)

ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ధర్మవరం శాఖ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మవరం పట్టణంలోని ఎన్జీఓ హోమ్స్‌లో సీనియర్ విశ్రాంత ఉద్యోగులకు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు గారు హాజరై మాట్లాడుతూ, ప్రభుత్వ వ్యవస్థ బలోపేతానికి విశ్రాంత ఉద్యోగులు చేసిన సేవలు అమూల్యమైనవని అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా సమాజానికి దిశానిర్దేశం చేసే అనుభవం, విజ్ఞానం విశ్రాంత ఉద్యోగులకే సొంతమని పేర్కొన్నారు. యువతకు వారు ఆదర్శప్రాయులని, వారి సూచనలు, సలహాలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయని హరీష్ బాబు గారు అన్నారు. ఈ సందర్భంగా సుదీర్ఘ కాలం ప్రభుత్వ సేవలో నిబద్ధతతో పనిచేసి ప్రజలకు సేవలందించిన విశ్రాంత ఉద్యోగులను స్మరించుకుంటూ, వారి సేవలను కొనియాడుతూ సన్మానాలు అందజేశారు. అలాగే విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. భవిష్యత్తులో కూడా విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు, సభ్యులు, సీనియర్ ఉద్యోగులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

AP 4PG 18 12 2025 THURSDAY qxp_Layout 1 17-12-2025 10:50 PM Page 2



## సంత మార్కెట్ రోడ్డు పరిశీలన



యాడికి, డిసెంబర్ 17 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలోని సంత మార్కెట్ రోడ్డు గురించి ప్రజా పరిష్కార వేదికలో ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి గారికి గ్రామస్తులు అర్జీ సమర్పించారు. ఎమ్మెల్యే గారి ఆదేశాల మేరకు రోడ్డు సమస్య పరిష్కారానికి సంబంధించి బుధవారం మండల ఇంజనీర్ వరప్రసాద్ , సచివాలయ ఇంజనీర్లు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు విశ్వనాథ్ , దామినేని నరసింహా చౌదరి, జాకీర్ హుస్సేన్ తదితరులు రోడ్డు పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా పరిశీలించిన అధికారులు త్వరలోనే సంత మార్కెట్ రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే గారికి, అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## రెవిన్యూ సిబ్బందితో ఆర్డీవో సమావేశం




యాడికి, డిసెంబర్ 17 (అనంత ప్రభ)

గుంతకల్ రెవెన్యూ డివిజినల్ అధికారి శ్రీనివాస్ బుధవారం యాడికి తహశీల్దార్ కార్యాలయం నందు తహసిల్దార్ ప్రతాప్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు మరియు గ్రామ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి జి ఆర్ ఎస్ అర్జీలపై క్షుణ్ణంగా విచారణ జరిపి, నిబంధనల ప్రకారం సమగ్ర నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, ఆలస్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

## యాడికి కాలువకు రెండోసారి నీటి విడుదల



యాడికి, డిసెంబర్ 17 (అనంత ప్రభ)

తాడిపత్రి ఎమ్మెల్యే జెసి ఆస్మిత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో బుధవారం యాడికి కాలువకు రెండవ సారి నీటిని విడుదల చేసిన సందర్భంగా హెచ్ ఎల్ సి డి ఏ బసవ రాజుని యాడికి మాజీ ఎంపీపీ వేలూరి రంగయ్య సన్మానించారు. యాడికి కాలువకు సమయానికి నీటి సరఫరా అందించడం వల్ల పంటలకు మేలు జరుగుతుందని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కాలువకు రెండోసారి నీరు వదలడం తమకు ఎంతో ఊరట కలిగించిందని, ప్రజాప్రతినిధులు మరియు అధికారుల సమన్వయంతోనే సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు

## అయ్యప్ప దేవస్థానంలో పడిపూజ కార్యక్రమం



యాడికి, డిసెంబర్ 17 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రములోని శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో శుక్రవారం పడిపూజ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని యాడికి మండల బీ.సీ. సెల్ అధ్యక్షుడు తిరంపురం నీలకంఠ ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు. పూజా కార్యక్రమం అనంతరం రహంతుల్లా కుమారుడి జన్మదినాన్ని పురస్కరించుకుని అయ్యప్ప మాలధారులకు బిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులతో పాటు విశ్వనాథ్, గుండా నారాయణస్వామి, టి.డి.పి. పట్టణ అధ్యక్షుడు వెలిగండ్ల ఆదినారాయణ, దాసరి రామచంద్ర, ఉపేంద్ర, సుభహాన్, సెల్ పాయింట్ చాంద్ బాషా, ఫైబర్ చందు తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పేరు, నాగిరెడ్డిపల్లె లో పొలం పిలుస్తోంది కార్యక్రమం




కూడేరు, డిసెంబర్ 17 (అనంత ప్రభ)

కూడేరు మండల పరిధిలోని ఇప్పేరు,నాగిరెడ్డిపల్లి గ్రామంలోని రైతు సేవా కేంద్రలలో బుధవారం రోజున పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు రబీ పంట సాగు విస్తీర్ణం గురించి. తెలియచేయడం జరిగినది. ప్రభుత్వం కంది కొనుగోలు ఎప్పుడు చేస్తారని రైతులు అడగగ అందుకు మండల వ్యవసాయ అధికారులు కంది కొనుగోలు తదితర అంశాలపై ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలియజేశారు. సూక్ష్మ పోషకాలు అయిన జిప్సం కూడేరు గోడౌన్ లో ఉంది కావలసిన రైతులు కూడేరు రైతు సేవ కేంద్రం లో సంప్రదించవలసిందిందిగా తెలియచేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏవో శుభకర్ మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు రాజకుమార్ , నరేష్ కుమార్ గ్రామ రైతులు పాల్గొన్నారు

## ధర్మవరంలో దివ్యాంగుల సమస్యలపై అవగాహన సదస్సు



ధర్మవరం, డిసెంబర్ 17 (అనంత ప్రభ)

దివ్యాంగుల సమస్యల పరిష్కారం, హక్కులపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ధర్మవరం పట్టణం, ఎన్జీవో హోమ్ లో సక్షమ్ ధర్మవరం శాఖ %–% శ్రీ సత్యసాయి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల సమస్యలపై అవగాహన సదస్సు బుధవారం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ బాబు గారు మాట్లాడుతూ,.....

దివ్యాంగులు సమాజంలో గౌరవంగా, స్వావలంబనతో జీవించేలా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా దివ్యాంగుల పెన్షన్లు, వైద్య సహాయం, ఉపాధి అవకాశాలు, గుర్తింపు కార్డులు, రవాణా సౌకర్యాలు వంటి అంశాల్లో పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అందుబాటులో ఉన్నదని, అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేలా తాము సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సక్షమ్ ధర్మవరం శాఖ ప్రతినిధులు, దివ్యాంగ సంఘాల నాయకులు, స్థానిక నాయకులు మరియు పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు

## సంక్రాంతికి 'పాడి' పోటీలు



అనంతపురం, డిసెంబర్ 17 (అనంత ప్రభ)

రాయలసీమ జిల్లాల పరిధిలో తొలిసారిగా పాడి ఆవులతో పాల దిగుబడి, లేగదూడల ప్రదర్శన పోటీలు నిర్వహించాలని పశుసంవర్ధకశాఖ అధికారులు నిర్ణయించారు. ఈ అంశంపై మంగళవారం స్థానిక పశుశాఖ కార్యాలయంలో డీడీలు, ఏడీలు, డాక్టర్లతో ఆ శాఖ జేడీ డాక్టర్ జి.ప్రేమ్‌చంద్ సమీక్షించారు. ఇప్పటి వరకూ కోస్తా జిల్లాల్లోనే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించారని, తొలిసారిగా అనంతపురం జిల్లాలోనూ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. డైరెక్టరేట్ అనుమతితో పోటీలు ఏర్పాటు, ప్రోత్సాహకాలు, ఇతరత్రా పురస్కారాలు అందజేస్తామన్నారు. రైతుల పండుగ సంక్రాంతిని పురస్కరించుకుని జనవరి రెండో వారంలో అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లిలో పెద్ద ఎత్తున పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పాల దిగుబడి పోటీలకు జిల్లా నలుమూలల నుంచి కనీసం 150 నుంచి 200 వరకు పాడి ఆవులు తరలివచ్చేలా చూడాలన్నారు. అలాగే వందల సంఖ్యలో లేగదూడలతో ప్రదర్శన నిర్వహించాలన్నారు. ఇదే సందర్భంలో గర్భకోశవ్యాధి శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన మందులు, వైద్య చికిత్సలు అందజేయాలన్నారు. పశుసంపద, జీవసంపద పరిరక్షణ, నాణ్యమైన పాడి ఉత్పత్తి కోసం పాడి రైతులను ప్రోత్సహించే క్రమంలో మొదటిసారిగా పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు జేడీ తెలిపారు. సమావేశంలో డీడీలు డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి, ఏడీలు రామచంద్రారెడ్డి, రత్నకుమార్, రాధిక, సుబ్రహ్మణ్యం, సురేష్, డాక్టర్లు గోల్డ్‌మన్, శారద, మహేష్, ఉష, సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు

## రాయలచెరువులో ఇంటింటా ఫీవర్ సర్వే



యాడికి, డిసెంబర్ 17 (అనంత ప్రభ)

జిల్లా మలేరియా అధికారి డి ఓబులు ఆదేశాల ప్రకారము రాయలచెరువు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవరాజన్, డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు రాయలచెరువు రెండవ సచివాలయం నందు ఇంటి ఇంటికి వెళ్లి ఫీవర్ సర్వే తనిఖీ చేయడం జరిగింది. ప్రజలకు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గునియా మొదలగు జ్వరాలపైన అవగాహన కల్పిస్తూ, వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత గురించి మరియు డ్రై డే ఫ్రైడే గురించి వివరించారు. ప్రతి శుక్రవారం వార్డులోని ప్రజలందరూ ఫ్రైడే డ్రై డే తప్పక పాటించాలని తెలియచేశారు. రాయలచెరువు టు సచివాలయం ఏఎన్ఎం బయమ్మ ఎం ఎఫ్ టు , డైరీలను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ ను పరిశీలించి ల్యాబ్ టెక్నీషియన్ సాయిలతకు సూచనలు సలహాలు తెలియజేయడం జరిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు జ్వరంతో వచ్చిన ప్రతి ఒక్కరికి మలేరియా డెంగ్యూ టైఫాయిడ్ చికెన్ గునియా మొదలగు రక్త పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాయలచెరువు మేల్ సూపర్వైజర్ షబ్బీర్ అహ్మద్, ఏఎన్ఎం బయమ్మ, ఎంపీహెచ్ఏ మెయిల్ మైనుద్దీన్, ఎమ్ ఎల్ హెచ్ పి ఉమా, ఆశా కార్యకర్త స్వాతి మొదలగు వారు పాల్గొన్నారు

## సిపిఐకి నూరేళ్లు



యాడికి, డిసెంబర్ 17 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలోని నారాయణస్వామి కాలనీలో ఈ నెల 25వ తేదీన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు సీపీఐ యాడికి మండల కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బుధవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ, సీనియర్ నాయకులు వెంకటరాముడు యాదవ్, శ్రీరాములు, ఓబిరెడ్డి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ దేశంలో స్థాపితమై డిసెంబర్ నెలాఖరికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా శతజయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా యాడికి మండలంలో సీపీఐ పార్టీలో దీర్ఘకాలం సేవలందించిన నాయకులకు, అలాగే పార్టీ కోసం పోరాడుతూ ప్రాణత్యాగం చేసిన నాయకుల కుటుంబాలకు చిరు సత్కారం చేయాలని మండల కమిటీ తీర్మానం చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 25న జరిగే శతజయంతి వేడుకల్లో మండలంలోని సీపీఐ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి వడ్డె రాముడు, చేనేత మండల కార్యదర్శి బండారు రాఘవ, సీనియర్ నాయకులు గరిడీ శివన్న, నబి రసూల్ తదితరులు పాల్గొన్నారు

## కుర్లపల్లి లో సిసి రోడ్ నిర్మాణ పనులు వేగవంతం



ఆత్మకూరు, డిసెంబర్ 17 (అనంత ప్రభ)

రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరు పంచాయతీ కుర్లపల్లి గ్రామం లో మాజీ మంత్రి వర్యులు ప్రస్తుత ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ సహకారం తో 10 లక్షలు ఉపాధి హామీ నిధులతో సిసి రోడ్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. సిసి రోడ్ నిర్మాణ పనులను బుధవారం మండల కన్వీనర్ బోయ గంతి శ్రీనివాసులు, హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిది శశాంక్ బాబు, వార్డు మెంబర్ రవి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏకాంత, ఇంజినీరింగ్ అసిస్టెంట్ స్వర్ణ లత పరిశీలించారు.వారు మాట్లాడుతూ ఒక కోటి రూపాయలతో మండలం లో సిసి రోడ్డు ఎమ్మెల్యే సునితమ్మ శాంక్షన్ చేయించడంతో స్థానిక ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు గ్రామాలలో సిసి రోడ్ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. మిగిలిన గ్రామాల లో సిసి రోడ్డు వేసి అభివృధి చేస్తోందన్నారు

## రాప్తాదుకూటమి యమ్. యల్. ఏ. మర్యాద పూర్వకంగా కలసిన కూటమి నాయుకులు కమ్మూరు నాగరాజు



అనంతపురం, డిసెంబర్ 17 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా కేంద్రం లో రాప్తాదు నియోజకవర్గం కూటమి యమ్. యల్. ఏ. శ్రీమతి పరిటాల సునీతమ్మ గారిని, ధర్మవరం టీడీపీ ఇంచార్జ్ శ్రీ పరిటాల శ్రీరామ్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి వివిధ అంశాలు చర్చించిన టీడీపీ నాయకులు కమ్మూరు నాగరాజు, పోట్ల రవి.రాప్తాదు నియోజకవర్గం లో ప్రజలకు అన్ని విధాలా చేదోడు వాడోడు ఉన్న శ్రీరామ్ ప్రజల సమస్య లను మరియు వారికీ ప్రభుత్వం తరుపున అందవలసినఅభివృద్ధి పాతకాలురైతుల సమస్య లను నియోజకవర్గం లో జరుగుతున్న విద్య వైద్యంగురించి మాట్లాడం జరిగింది.

## వేతన సవరణ చేయాలని నిరసన



అనంతపురం, డిసెంబర్ 17 (అనంత ప్రభ)

హెచ్ఆర్ పాలసీ అమలు, వేతన సవరణ చేపట్టాలనే ప్రధాన డిమాండ్లతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా సహకార అధికారి (డీసీవో) కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, డి.శ్రీనివాసులు మాట్లాడుతూ హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, పేస్కేల్ కూడా నిర్ణయిస్తూ 2019లో జీవో 36 విడుదల చేసినా అమలుకు నోచుకోలేదన్నారు. 2019 తర్వాత వేతన సవరణ చేయకుండా చాలీచాలనీ జీతాలు ఇస్తున్నట్లు వాపోయారు. అది కూడా 'డ్యూటు' పద్ధతిలో చెల్లించడం దారుణమన్నారు. 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచాలన్నారు. రూ.20 లక్షల వరకు ఎంప్లాయీస్ ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని, గ్రాట్యూటీ చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. కంప్యూటరీకరణ చేయలేదనే నెపంతో రూ.2.80 కోట్ల వరకు వేసిన అపరాధ రుసుం తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ సమస్యలపై డీసీవో అరుణకుమారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సీఐటీయూ నాయకుడు నాగేంద్ర, పీఏసీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.హనుమంతరెడ్డి, కోశాధికారి ఎం.హనుమంతరెడ్డి, నాయకులు డి.నారాయణ, నగేష్, రామాంజినేయులు, నరేంద్రరెడ్డి, కేసీ ఆంజనేయులు పాల్గొన్నారు.

## పోలీసుల వాహనాల తనిఖీలు




పుట్టపర్తి, డిసెంబర్ 17 (అనంత ప్రభ)

రోడ్డు సేఫ్టీ, ప్రజల భద్రత కోసం జిల్లాలోని ప్రధాన రహదారులు, జంక్షన్లు వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు."ప్రజల భద్రత పోలీసుల ప్రధాన ధ్యేయం. నేరాలను అరికట్టడం, చట్ట ఉల్లంఘనలను నిరోధించడం కోసం జిల్లాలో వాహనాల తనిఖీలు ప్రతీరోజు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీలలో లైసెన్స్, రిజిస్ట్రేషన్... అలాగే హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగం వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. మద్యం సేవించి వాహనం నడిపినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు పోలీసుల తనిఖీలకు సహకరించాలని, వాహన పత్రాలను ఎప్పుడూ వెంట ఉంచుకోవాలని, అలాగే అనుమానాస్పద వాహనాలు లేదా వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## ఐదుగురు జూదరులపై కేసు నమోదు



యాడికి, డిసెంబర్ 17 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలో జూదరులపై పోలీసులు దాడి నిర్వహించారు. బుధవారం సాయంత్రము యాడికి నుంచి బుగ్గ వైపు వెళ్లే రహదారి పక్కన ఉన్న కంపచెట్లలో కొందరు జూదం ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు యాడికి సిఐ శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి దాడి చేయగా జూదం ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.12,500 నగదు, ఒక పాత టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనం మరియు ఒక సెల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి జూదరులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు.

AP 4PG 18 12 2025 THURSDAY qxp_Layout 1 17-12-2025 10:50 PM Page 3











## కరివేపాకుని ఇలా తింటే షుగర్ ఉన్నవారికి మంచిదట..



కరివేపాకు ఆరోగ్యానికి నిజంగా చాలా మంచిది. అంతేకాకుండా, దీనిని వాడడం వల్ల జుట్టు సమస్యలు కూడా దూరమవుతాయని చెబుతున్నారు నిపుణులు. దీనిని అనేక రకాలుగా తీసుకుంటాం. కరివేపాకు పచ్చడి, వంటల్లో వాడడం, కరివేపాకు రైస్ ఇలా ఎన్నో రకాలుగా వాడతాం. దీంతో ఆరోగ్యంతో పాటు జుట్టుకి హెల్ప్ చేస్తుంది. అయితే, జుట్టు రాలడాన్ని దూరం చేసేందుకు కరివేపాకుని ఎలా వాడాలో ఇప్పుడు చూద్దాం.

జుట్టు ఆరోగ్యానికి..

కరివేపాకు జుట్టు రాలడాన్ని తగ్గించడమే కాకుండా నెరసిపోవడాన్ని కూడా దూరం చేసి జుట్టు పెరిగేలా చేస్తుంది. ఇక మైగ్రేన్ వంటి తలనొప్పులని కూడా దూరం చేస్తుంది. దీంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలను దూరం చేసి బరువు తగ్గడానికి హెల్ప్ చేస్తుంది. హార్మన్ల సమస్యల్ని దూరం చేస్తుంది.

జుట్టుకి కరివేపాకు..

కరివేపాకు హెయిర్ మాస్క్, హెయిర్ ఆయిల్‌ని వాడడం వల్ల చుండ్రు, జుట్టు రాలడం, తెల్లబడడం వంటి సమస్యలన్నీ దూరమవుతాయి. దీంతో పాటు జుట్టు పెరిగేలా చేస్తుంది.

చుండ్రు దూరం..

కరివేపాకుని మిక్సీ పట్టి మజ్జిగలో కలిపి పేస్టలా చేయండి. దీనని తలకు పట్టించాలి. ఆరిపోయాక నీటితో కడగాలి. వారానికి రెండు, మూడు సార్లు ఇలా చేస్తే సమస్య దూరం..

నోటి దుర్వాసన..

చాలా మందికి అనేక కారణాలతో నోటి నుండి దుర్వాసన వస్తుంది. అలాంటి సమస్యకి కరివేపాకుతో చెక్ పెట్టొచ్చు. దీని కోసం 5 తాజా కరివేపాకులని తీసుకుని 5 నిమిషాల పాటు నమలాలి. తర్వాత మీ నోటిని నీటితో క్లీన్ చేసుకోండి. దీంతో నోటి దుర్వాసన దూరం.

బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్..

షుగర్ పేషెంట్స్‌కి కరివేపాకు బాగా హెల్ప్ చేస్తుంది. దీనిని చట్నీలా చేసుకుని తినడం, వారి డైట్‌లో యాడ్ చేసుకోవాలి. కరివేపాకులోని ఫ్లేవనాయిడ్స్ బాడీలోని కార్బోహైడ్రేట్స్ నుండి గ్లూకోజ్‌కి జీవక్రియను నిరోధిస్తాయి. దీంతో రక్తంలో చక్కెర నిల్వల్ని నియంత్రించడంలో సాయపడతాయి.

## మీ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచే.. ఆహారాలు ఇవే..!



జీర్ణ సమస్యలు సాధారణంగా.. అనారోగ్యకరమైన ఆహారం, నిశ్చల జీవనశైలి కారణంగా ఎదురవుతూ ఉంటాయి. మనం తీసుకునే ఆహారాన్ని జీర్ణం చేయడంతోపాటు.. శరీరానికి అవసరమైన పోషకాలను శోషించుకొని వ్యర్థాలను బయటకు నెట్టేయడంలో జీర్ణవ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. జీర్ణవ్యవస్థ సరిగ్గా పని చేయకపోతే.. మలబద్ధకం, యాసిడ్ రిఫ్లక్స్, ఎసిడిటీ, గ్యాస్, అజీర్ణం, త్రేనుపు, గుండెల్లో మంట, ఇరిటేటబుల్ బౌల్ సింద్రోమ్ వంటి సమస్యలు ఎదురవుతాయి. జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో, పనితీరును మెరుగుపరచడంలో కొన్ని ఆహార పదార్థాలు సహాయపడతాయి. మీ జీర్ణ వ్యవస్థను రక్షంచే ఆహారాలు ఏమిటో తెలుసుకోవాలంటే.. ఈ స్టోరీ చదివేయండి.

పెరుగు..

మీ జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని పెంపొందించే మరో అద్భుతమైన ఆహారం పెరుగు. పెరుగులోని ప్రోబయోటిక్స్ గట్ మైక్రోబయోమ్ సమతుల్యతను మెరుగుపరుస్తుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మనం తీసుకున్న ఆహారం సులభంగా జీర్ణమై, కడుపుబ్బరం వంటి సమస్యలను దూరం చేసే మంచి బ్యాక్టీరియాను ఉత్పత్తి చేయడంలో పెరుగు సమర్థంగా పనిచేస్తుంది. దీన్ని ఆహారంలో భాగం చేసుకుంటే.. జీర్ణక్రియ సాఫీగా జరిగి, తేన్పులతో పాటు ఇతర జీర్ణ సంబంధిత సమస్యలు దూరం అవుతాయి.

అల్లం..

వికారం, ఉబ్బరం, అజీర్ణం వంటి జీర్ణ సమస్యలకు చికిత్స చేయడానికి అల్లాన్ని ఎన్నో శతాబ్దాలుగా వాడుతున్నారు. అల్లంలో జింజెరోల్స్, షోగోల్స్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థలో మంటను తగ్గిస్తుయి. జీర్ణక్రియను ప్రోత్సహించడలో సహాయపడతాయి. అల్లం జీర్ణవ్యవస్థలోని కండరాలను సడలించడంలో సహాయపడుతుంది. ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలను నివారిస్తుంది. రోజుకు రెండు లేదా మూడు సార్లు చిన్న అల్లం ముక్కను తీసుకోవడం వల్ల తేన్పుల సమస్య నుంచి ఉపశమనం పొందచ్చు.

ఓట్స్..

ఓట్స్‌లో కరిగే ఫైబర్ మెండుగా ఉంటుంది. ఇది పేగు కదలికలను నియంత్రించడంలో, మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది. కరిగే ఫైబర్ ఫైబర్ పేగులో జెల్ లాంటి పదార్థాన్ని ఏర్పరుస్తుంది, ఇది జీర్ణవ్యవస్థ ద్వారా ఆహార మార్గాన్ని నెమ్మదిస్తుంది. దీంతో.. శరీరం పోషకాలను మరింత సమర్థవంతంగా గ్రహించుకోగలదు.

బొప్పాయి..

బొప్పాయిలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. పాపైన్ ప్రొటీయోలైటిక్ ఎంజైమ్, అంటే ఇది జీర్ణవ్యవస్థలో ప్రోటీన్లను విచ్ఛిన్నం చేయడానికి సహాయపడుతుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడానికి సహాయపడుతుంది. ఇది గ్యాస్, ఉబ్బరం, గ్యాస్ వంటి జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది. బొప్పాయిలో ఫైబర్ ఉంటుంది, ఇది ప్రేగు కదలికలను నియంత్రిస్తుంది. మలబద్ధకాన్ని దూరం చేస్తుంది.

పుదీనా..

పుదీనా.. ఉబ్బరం, అజీర్ణం, వికారం వంటి జీర్ణ సమస్యలకు చికిత్స చేయడానికి ఔషధంలా పనిచేస్తుంది. పుదీనాలో.. జీర్ణాశయ కండరాలను సడలించడానికి సహాయపడే సమ్మేళనాలు ఉంటాయి. ఇది ఉబ్బరాన్ని నివారించడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో తోడ్పడుతుంది. పుదీనా జీర్ణవ్యవస్థలో మంటను తగ్గిస్తుంది, ఇరిటేటబుల్ బౌల్ సింద్రోమ్ సమస్యను పరిష్కరిస్తుంది.

## తీపి పదార్థాలు తినాలన్న కోరిక పెరిగిపోతోందా? అయితే జాగ్రత్త ఈజీ..రుచేసుకోవచ్చు



తీపి పదార్థాలను తినాలన్న కోరిక అందరికీ ఉంటుంది. కాస్త తీపి తిన్నాక ఆ కోరిక తగ్గిపోతుంది. కానీ కొందరికి రోజురోజుకి తీపిగా ఉండే పదార్థాలను తినాలన్న కోరిక ఎక్కువైపోతూ ఉంటుంది. అలా తీపి ఆహారాల కోరిక పెరుగుతుందంటే అంటే భవిష్యత్తులో కొన్ని రకాల మానసిక సమస్యలు వచ్చే అవకాశం ఉందని చెప్పే ఒక హెచ్చరికగా భావించాలి. అల్జీమర్స్ వ్యాధి... జ్ఞాపకశక్తి, ఆలోచన , సామాజిక సామర్థ్యాలను ప్రభావితం చేస్తుంది. తీపి ఆహారం తినాలన్న కోరిక అధికంగా ఉన్నవారికి సమీప భవిష్యత్తులో ఈ అల్జీమర్స్ వ్యాధి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు అధ్యయనకర్తలు. దీన్నే డిమెన్షియా అని కూడా అంటారు. డిమెన్షియా అంటే చిత్త వైకల్యం అని కూడా చెప్పుకోవచ్చు. ఇది మెదడులోని వ్యక్తిత్వం, ప్రవర్తన, మాట తీరు గురించి పని చేసే భాగాలపై ప్రభావం చూపిస్తుంది. ఇది మెదడులో ఫ్రంట్ టెంపోరల్ లోబ్స్‌లో ఉన్న న్యూరాన్లకు నష్టం కలిగేలా చేస్తుంది. నిజానికి ఈ సమస్య 40 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల మధ్య ఉన్న వ్యక్తులకు వస్తుంది. ఇలాంటివారు తీపి పదార్థాలు తినాలన్న కోరిక పెరుగుతుంటే, తినకుండా తమను తాము నియంత్రణలో ఉంచుకోవడం చాలా ముఖ్యం.

ఏమిటీ లింక్?

అమెరికా నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ చెబుతున్న ప్రకారం ఆహారంపై ఉన్న ఆసక్తికి, డిమెన్షియా వచ్చే అవకాశానికి మధ్య బంధం ఉంది. ప్రవర్తనలో మార్పులు, తీపి పదార్థాలను అధికంగా కోరుకోవడం వంటి వన్నీ కూడా డిమెన్షియా రాకకు సంకేతాలుగా చెబుతున్నారు. అతిగా తినడం, అతిగా మద్యం సేవించడం, తినేటప్పుడు మర్యాదలు పాటించకపోవడం వంటివి కూడా భవిష్యత్తులో డిమెన్షియా వచ్చే రాకను సూచిస్తున్నట్టే. ఇవే కాదు ఇంకా అనేక లక్షణాలు ఉన్నాయి. తదేకంగా చూడడం, వ్యక్తులతో అధికంగా మాట్లాడడం, చేసే పనిపై దృష్టి పెట్టలేకపోవడం, చేసిన పనే పదేపదే చేయడం వంటివి కూడా భవిష్యత్తులో ఈ వ్యాధి రాకకు సూచనలే.

చికిత్సజి

ఈ వ్యాధికి చికిత్స లేదు. అయితే లక్షణాలను మాత్రం మందుల ద్వారా తగ్గించవచ్చు. వైద్యులు ఈ వ్యాధి బారిన పడిన వారికి యాంటీ డిప్రెసెంట్స్ ఇస్తుంటారు. ఇది అతిగా తినడం, విచిత్ర ప్రవర్తనలను తగ్గించడానికి సహాయపడతాయి. అలాగే ఫిజియోథెరపీని కూడా సూచిస్తారు. స్పీచ్ థెరపీ ద్వారా కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరచడానికి ప్రయత్నిస్తారు. ఏది ఏమైనా అతి స్వీట్లు తినడం మాత్రం ఆరోగ్యానికి అనర్ధదాయకం

## ఈ డ్రింక్స్ ఉదయం పూట తాగితే.. అందమైన మెరిసే చర్మం మీ సొంతం..!



ప్రకాశవంతంగా మెరిసే ముఖం కావాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ముఖ్యంగా అమ్మాయిలకు ఈ కోరిక బలంగా ఉంటుంది. ఐతే, ప్రస్తుత లైఫ్‌స్టైల్, కాలుష్యం, ఒత్తిడి, రేడియేషన్ కారణంగా.. చర్మ సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. మొటిమలు, బ్లాక్ హెడ్స్, టాన్, వైట్ హెడ్స్ వంటి సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి, అందమైన ముఖం సొంతం చేసుకోవడానికి ఏవేవో క్రీమ్‌లు వాడతారు, ట్రీట్మెంట్స్ తీసుకుంటూ ఉంటారు. కొంతమంది న్యాచురల్ ప్యాక్స్‌తో ఈ సమస్యలకు చెక్ పెట్టాలనుకుంటారు. అయితే, చర్మానికి బయట నుంచి క్లీన్ చేయడం, పోషకణ అందించడం ఎంత ముఖ్యమో.. లోపలి నుంచీ అంతే కేర్ తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. మిలమిల మెరిసే చర్మం కావాలంటే.. దాన్ని డిటాక్స్ చేయడం చాలా ముఖ్యం. మీ చర్మం మెరుస్తూ ఉండేందుకు ప్రతి రోజూ ఉదయం తాగాల్సిన కొన్ని డిటాక్స్ డ్రింక్స్ చూసేయండి.

పసుపు టీ..

పసుపులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ వంటి వివిధ ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది మన చర్మంపై మొటిమలను తొలగించడానికి, గాయాలను నయం చేయడానికి సహాయపడుతుంది. పసుపు చర్మం మంట, చికాకు వంటి సమస్యలను పరిష్కరిస్తుంది. పసుపు టీ తాగడానికి ఒక గ్లాస్ నీళ్లలో అర స్పూన్ పసుపు వేసి 5 నిమిషాల పాటు మరిగించండి. ఆ తర్వాత స్టవ్ ఆఫ్ చేసి... కొంచెం నిమ్మరసం, తేనె కలిపి గోరువెచ్చగా తాగలి. ఇలా రోజూ ఉదయం తాగితే.. స్పాట్ లెస్ బ్యూటీ మీ సొంతం.

విటమిన్ సి డ్రింక్స్..

విటమిన్ సి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. విటమిన్ సి శరీరంలోని కెమికల్ టాక్సిన్స్ నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. విటమిన్ సిలో యాంటీ ఏజింగ్ గుణాలు ఉంటాయి. ఇది ఫ్రీరాడికల్స్ నుంచి చర్మ కణాలను రక్షిస్తుంది. వృద్ధాప్య ఛాయలను నివారిస్తుంది. విటమిన్ సి డ్రింక్ తయారు చేయడానికి.. రాత్రి పూట మీకు కావలిసినంత నీటిలో నిమ్మ, పైనాపిల్ , కివీ, ఆరెంజ్ సహా మీకు నచ్చిన సిట్రస్ పండ్లు వేసుకోవచ్చు. ఈ నీటిని ఉదయం పూట తాగండి. ఇది శరీరాన్ని, చర్మాన్ని శుభ్రపరిచే బెస్ట్ డిటాక్స్ డ్రింక్ అని చెప్పొచ్చు.

గ్రీన్ జ్యూస్..

ఆకుపచ్చని కూరగాయలు, పండ్లలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్స్ మెండుగా ఉంటాయి. ఇవి చర్మం నుంచి మలినాలను, వ్యర్థాలను తొలిగించి.. చర్మాన్ని డిటాక్స్ చేస్తాయి. దీంతో చర్మం తాజాగా, ప్రకాశవంతంగా మారుతుంది.

ఎలా తయారు చేసుకోవాలి..

పాలకూర, గ్రీన్ యాపిల్, కీరా, చిన్న అల్లం ముక్కను.. మిక్సీ జార్ వేసి కొన్ని నీళ్లు పోసి జ్యూస్‌లా చేయాలి. దీనికి టేస్ట్ కోసం కొంచెం నిమ్మరసం యాడ్ చేసుకోవాలి. ప్రతి రోజూ ఉదయం ఈ జ్యూస్ తాగితే.. చర్మమే కాకుండా శరీరం మొత్తం డిటాక్స్ అవుతుంది.

దానిమ్మ జ్యూస్..

దానిమ్మలోని యాంటీఆక్సిడెంట్లు చర్మంలోని మలినాలను తొలగిస్తాయి. చర్మానికి తాజాదనం, మెరుపును అందిస్తాయి. దానిమ్మలోని లైకోపీన్ మంచి రంగును ఇస్తాయి. వృద్ధాప్య ఛాయలు త్వరగా రాకుండా నివారిస్తుంది. మిమ్మల్ని యవ్వనంగా ఉంచుతుంది. ఉదయం పూట దానిమ్మ జ్యూస్ తాగితే.. మీ చర్మంలోని మలినాలు తొలగి ఫ్రెష్‌గా ఉంటుంది.


పుచ్చకాయ, తులసి జ్యూస్..

పుచ్చకాయ, కీరా, తులసి జ్యూస్ బెస్ట్ డిటాక్స్ డ్రింక్ అని చెప్పవచ్చు. ఇది చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. చర్మంలో నూనె స్రావాన్ని సమతుల్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. పుచ్చకాయలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ మైక్రోబియల్ గుణాలు చర్మాన్ని యవ్వనంగా ఉంచుతాయి. కీరా, పుచ్చకాయలో.. పొటాషియం కంటెంట్ శరీరంలో అదనపు సోడియంను గ్రహించడంలో సహాయపడుతుంది. దీని వల్ల చర్మం హైడ్రేట్‌గా ఉండి.. మెరుస్తూ ఉంటుంది.

అరకప్పు పుచ్చకాయ, సగం దోసకాయ, కొద్దిగా తులసి వేసి బాగా గ్రైండ్ చేసి జ్యూస్‌ను ఫిల్టర్ చేయాలి. దీనిలో కాస్త నిమ్మరసం కలిపి.. ఉదయం పూట తాగితే చర్మం మెరుస్తుంది.

# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?





కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దుగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్ధ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యూడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.




# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేర-ువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పు-రస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.

అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యూరిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు.పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉ ంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్దలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?





సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస-ున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలే-సుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్లు 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్స్ట్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ.. పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉ ంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీ పురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికీ.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్స్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యూరిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మా-త్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోషన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉ ంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్ మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభి-ప్రాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com